

పని నేర్పి.. కొలువు చూపి

డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో శిక్షణలు ఉపాధి చూపుతున్నాయి. ఇంగ్లిష్‌లోనూ నైపుణ్యం కల్పిస్తున్నారు. - 8లో



ప్రభుత్వ వైద్యానికి పెద్దపీట

నరసన్నపేట ఆస్పత్రిలో రూ.12.6 కోట్లతో నూతన భవనాలు నిర్మించారు. వాటిని ప్రారంభించారు. - 8లో

జిల్లా హ్యాండ్‌బాల్ ఎంపికలు రేపు

టెక్కలి: టెక్కలిలో సోమవారం జిల్లా స్థాయి హ్యాండ్‌బాల్ జట్ల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు ఆర్గ నైజింగ్ కార్యదర్శి బి.నారాయణరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. సీనియర్ విభాగంలో పురుషులు, మహిళల జట్ల ఎంపికలు నిర్వహిస్తు న్నట్లు ఆయన పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 8500007272 ఫోన్ నంబరుకు సంప్రదించాలని తెలిపారు.

న్యూస్‌రీల్

ఆపత్కాలంలో సాయం



సీఎం సహాయనిధి చెక్కును గిరిధర్‌రావుకు అందజేస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

ఆమదాలవలస: ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడమే ప్రభుత్వ ధ్యేయమని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. ఆమదాలవలస పట్టణానికి చెందిన లింగిబేరి గిరిధర్‌రావు అనే పాత్రికేయుడు అనారోగ్యంతో కార్పొరేట్ ఆస్పత్రిలో చేరి చికిత్స పొందారు. ఆ చికిత్సకు రూ. 3లక్షలు ఖర్చయ్యిందని స్పీకర్ కార్యాలయం నుంచి సీఎం సహాయనిధికి దరఖాస్తు చేయగా రూ. లక్ష మంజూరైంది. ఈ మొత్తాన్ని చెక్కు రూపంలో బాధితునికి శనివారం అందజేశారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ నేతృత్వంలో ప్రభుత్వం అన్ని వర్గాలకు సాయం చేస్తోందని చెప్పారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ దుంపల శ్యామలరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు పొన్నాడ చిన్నారావు పాల్గొన్నారు.

‘చేనేత సంఘాల సమస్యలు పరిష్కరిస్తాం’



నేత ప్రక్రియను పరిశీలిస్తున్న ఆప్కో ఎండీ పావనమూర్తి

పొందూరు : రాష్ట్రంలోని చేనేత సహకార సంఘాల్లో సమస్యలు పరిష్కరిస్తామని ఆప్కో ఎండీ ఆర్.పావనమూర్తి తెలిపారు. మండల కేంద్రంలోని సాయిబాబా చేనేత సహకార సంఘాన్ని, ఏఎఫ్‌కేకే సంఘాన్ని శనివారం ఆయన సందర్శించారు. నేత ప్రక్రియను పరిశీలించారు. గత ఏడాది డిసెంబర్ వరకు చేనేత సహకార సంఘాలకు ఉన్న బకాయిలను చెల్లించామని తెలిపారు. రాష్ట్రంలో విద్యార్థులకు సరిపడా స్కూల్ యూనిఫారాలను ఉత్పత్తి చేయడానికి తగినంత మంది కార్మికులు లేరని, స్కూల్ యూనిఫారాలు తయారు చేసే నేత కార్మికులు కేవలం కడపలోనే ఉన్నారని చెప్పారు. దుప్పట్లు, తువ్వాళ్లు ఇతర వస్త్రాలను ప్రభుత్వం ఆప్కోను నుంచి మాత్రమే కొనుగోలు చేస్తోందన్నారు. పొందూరు చేనేత సంఘం ద్వారా గోరంచు పంచెల కొనుగోలుకు ఆప్కో సిద్ధంగా ఉందని చెప్పారు. కార్యక్రమంలో చేనేత, జౌళి శాఖ ఏడీ ధర్మారావు, ఏఎఫ్‌కేకే సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ప్రసాద్, దండా వెంకట రమణ, సాయిబాబా చేనేత సంఘం మేనేజర్ శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

గలీజు పనులు గుర్తులేవా..?

80 అడుగుల రోడ్డులోని టీడీపీ కార్యాలయం



- ఎస్సీల కోసం కేటాయించిన భూమిలో టీడీపీ కార్యాలయం
- శ్రీకాకుళంలో రూ. 80కోట్ల విలువైన భూమిని సంవత్సరానికి రూ. 25వేలు లీజుతో కొట్టేసిన చంద్రబాబు
- అప్పట్లో మౌనం వహించిన ‘ఈనాడు’
- ప్రభుత్వ స్థలాలతో పార్టీ చేసుకుంటున్నారంటూ ప్రస్తుత ప్రభుత్వంపై దుష్ప్రచారం

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

పై చిత్రంలో ఉన్న భవనం పాత శ్రీకాకుళం పరిధిలోని 80 అడుగుల రోడ్డులో ఎన్‌టీఆర్ భవన్ పేరుతో కొనసాగుతున్న టీడీపీ కార్యాలయం. గత ఎన్నికలకు నాలుగు నెలలు ముందు ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబునాయుడు దీని నిర్మాణం ప్రారంభించారు. రెండెకరాల విస్తీర్ణంలో పార్టీ కార్యాలయం నిర్మాణం చేపట్టారు. అయితే ఈ స్థలాన్ని ఆ పార్టీ కొనలేదు. ఎన్నో ఏళ్ల కిందట దళితుల సంక్షేమం కోసం సేకరించి ఉన్న సాంఘిక సంక్షేమ శాఖకు చెందిన స్థలమిది. అప్పట్లో ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు తన పార్టీ కార్యాలయం కోసం రూ. 80కోట్ల విలువైన రెండెకరాల భూమిని 99 ఏళ్లకు లీజు కింద తన పార్టీకి కట్టబెట్టేశారు. ఇంతటి విలువైన భూమిని సంవత్సరానికి కేవలం రూ. 25వేలు ఫీజుతో 99 ఏళ్ల లీజుకింద ధారాదత్తం చేశారు. ఇప్పుడు రూ.80కోట్లకు పైగా విలువ ఉన్న భూమి కోసం 99 ఏళ్ల కాల వ్యవధిలో రూ.24.75లక్షలు మాత్రమే చెల్లించనుంది.

ఇంత జరిగినా ‘ఈనాడు’కు ఇందులో తప్పన్నదే కనిపించలేదు. ఇప్పుడు టీడీపీ అధికారం కోల్పోయాక వైఎస్సార్‌సీపీపై దుష్ప్రచారం చేయడమే పనిగా పెట్టుకుంది. 99 ఏళ్లకు లీజుకు ఇచ్చినప్పుడు అక్షరం ముక్క కూడా అచ్చేయకుండా ఇప్పుడు అదే పనిగా ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తోంది.

పేదలకు సెంటు స్థలం ఇవ్వకపోయినా..



అధికారంలో ఉన్న ఐదేళ్ల కాలంలో పేద వాళ్లకు సెంటు స్థలం కూడా టీడీపీ ప్రభుత్వం ఇవ్వలేదు. పేదలు దరఖాస్తు చేసుకోవడమే తప్ప స్థలాలు మంజూరు చేసిన దాఖలాల్లేవు. టీడీపీ ప్రభుత్వం ఉన్నంతకాలం తమ పార్టీ నాయకులు ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి, రికార్డులు మార్చేసి కాజేశారే తప్ప పేద వాడికి మేలు చేసిన సందర్భాల్లేవు. ఏ ఒక్కరికీ సెంటు స్థలమివ్వని టీడీపీ ప్రభుత్వం తమ పార్టీ కార్యాలయం కోసం మాత్రం నగరంలో ఎంతో విలువైన రెండు ఎకరాల భూమిని కేటాయించింది.

ఖరీదైన ప్రాంతంలో...

పాత శ్రీకాకుళం పరిధిలోని 80అడుగుల రోడ్డులో షెడ్యూల్ కులాల ఇళ్ల స్థలాల కోసం సాంఘిక సంక్షేమ శాఖ కొన్నేళ్ల కిందట భూమిని రైతుల నుంచి సేకరించింది. నిర్దేశిత మొత్తాన్ని చెల్లించి కొనుగోలు చేసింది. అందులో వివిధ అవసరాలకు వినియోగించగా రెండెకరాల భూమి మిగిలి ఉంది. కొన్నాళ్లుగా ఖాళీగా ఉంది. ఇంతలో టీడీపీ అధికారంలోకి వచ్చింది. దాంతో టీడీపీ నేతల కన్ను ఖాళీ భూమిపై పడింది. దాన్ని ఎలాగైనా దక్కించుకోవాలని పథక రచన చేశారు. ఇంకేముంది చేతిలో ఉన్న అధికారాన్ని అడ్డం పెట్టుకుని ఆ భూమిని కొట్టేసేందుకు పావులు కదిపారు. కింద స్థాయి నుంచి పైస్థాయి వరకు అధికారులు వత్తాసు పలికారు. చకచకా ఫైలు కదిపి 2015 సెప్టెంబర్ 4వ తేదీన టీడీపీ కార్యాలయం కోసం కేటాయించేశారు. టౌన్ సర్వే నెంబర్ 700-1లో 1.29ఎకరాలు, టౌన్ సర్వే నంబర్ 701-1లో 71సెంట్లు భూమిని టీడీపీకి అప్పగించేశారు.

జీఓలు మార్చి..

పార్టీ కార్యాలయాల కోసం ప్రభుత్వ భూమిని కేటాయించడం ఆనవాయితీగా వస్తోంది. పార్టీ కార్యాలయాల కోసం స్థలాలు కేటాయింపులు చేసేందుకు తగు నిబంధనలు కూడా ఉన్నాయి. గుర్తింపు కలిగిన పార్టీ రాష్ట్ర, జిల్లా కార్యాలయాల కోసం ఒక ఎకరా భూమిని 33 ఏళ్లకు నామినల్ లీజు కింద కేటాయించవచ్చు. కానీ చంద్రబాబు ప్రభుత్వం ఆ జీఓను కాదని కొన్ని షరతుల పెట్టి మరో జీఓ కింద ఏకంగా రెండెకరాలు కేటాయించింది. వాస్తవానికి తొలుత ఎకరా భూమి కోసమే జిల్లా పార్టీ తరఫున దరఖాస్తు చేశారు. అక్కడున్న మొత్తం భూమిని తీసేసుకుంటే భవిష్యత్‌లో ఎవరూ రారని, ఎలాంటి ఇబ్బందులు ఉండవని కొందరు అధికారులు, మరికొందరు పార్టీ నేతలు సూచించడంతో రెండో దరఖాస్తు చేశారు. ఖాళీగా ఉన్న రెండెకరాల భూమిని తమకే ఇవ్వాలని దరఖాస్తు చేయడం, దానికి అధికారులు వత్తాసు పలకడంతో చకాచకా ఫైలు కదిపారు. తమ ప్రభుత్వమే ఉండటంతో రాజధాని స్థాయిలో ఆమోద ముద్ర వేయించారు.

కేవలం రూ.25వేల లీజుకు ధారాదాత్తం..

దాదాపు రూ. 80కోట్ల విలువైన భూమిని సంవత్సరానికి రూ. 25వేల లీజు చొప్పున 99 ఏళ్లకు కట్టబెట్టారు. సాధారణంగా 33 ఏళ్లకు లీజుకు కేటాయిస్తుంటారు. కానీ అధికారం చేతిలో ఉండటంతో తమ పార్టీ కార్యాలయం కోసం ఏకంగా 99 ఏళ్లకు లీజుకిచ్చేశారు. దీంతో ఈ స్థలం దాదాపు టీడీపీ చేతిలోకి వెళ్లిపోయినట్టే. వ్యూహాత్మకంగా కారు చౌకగా కొట్టేసిన భూమిలో పార్టీ కార్యాలయం నిర్మించిన చంద్రబాబు ఎన్నికలకు నాలుగు నెలల ముందు స్వయంగా వచ్చి ప్రారంభోత్సవం చేశారు.

శ్వేతగిరిపై సంబరం





వేణుగోపాలస్వామి ఆలయం (ఇన్‌సెట్లో) కాళేయ మర్దన వేణుగోపాల స్వామి

- ఈ నెల 19 అర్ధరాత్రి వేణుగోపాల స్వామికి క్షీరాభిషేకం
- 20వ తేదీ ఉదయం వంశధార నదిలో చక్రతీర్థ స్నానం
- 24న తిరుకల్యాణ మహోత్సవం

గార:

శాలిహుండంలోని శ్వేతగిరి వేణుగోపాలుని సంబరానికి సిద్ధమైంది. ఇక్కడి కాళీయ మర్దన వేణుగోపాలస్వామి యాత్రకు మాఘశుద్ధ ఏకాదశి(భీష్మ ఏకాదశి) నాడు ప్రత్యేక జాతర నిర్వహిస్తారు. ఈ క్రమంలో ఈనెల 19వ తేదీన అర్ధరాత్రి స్వామికి క్షీరాభిషేక సేవ అనంతరం 20వ తేదీ మంగళవారం ఉదయం వంశధార నదిలో స్వామి ఉత్సవ మూర్తులకు చక్రతీర్థ స్నానం చేస్తారు. 24వ తేదీన మాఘ పౌర్ణమి రోజున కొండమీద తిరుకల్యాణ మహోత్సవాన్ని నిర్వహిస్తారు. ఈ యాత్రకు ఉత్తరాంధ్ర జిల్లాల నుంచే కాకుండా ఒడిశా నుంచి భక్తులు భారీగా తరలివస్తారు. ఈ ఆలయాన్ని క్రీస్తుశకం నాలుగో శతాబ్దంలో నిర్మించినట్లు చారిత్రక ఆధారాలు ఉన్నాయి.

సంతాన వేణుగోపాలుడు

భీష్మ ఏకాదశి రోజున జరిగే స్వామి చక్రతీర్థ స్నానంలో పాటు స్నానమాచరించి, కొండపై వ్రతమాచరించి ఉపవాసం చేసి స్వామిని దర్శించుకుంటే సంతానం కలుగుతుందని భక్తుల విశ్వాసం. అలాగే దాసురాళ్లు, దాసుళ్లు తరలివచ్చి స్వామికి పూజలు చేసి విభూతి ప్రసాదాన్ని తీసుకువెళ్తారు. శాలిహుండం యాత్ర తర్వాతే ఇంటి దగ్గర సంబరాలు చేసుకోవడం పరిపాటి. అందుకోసం దూరప్రాంతాల నుంచి ఆదివారం సాయంత్రం సరికే భక్తులు వస్తారు.



సిద్ధమవుతున్న బారికేడ్లు

దర్శనీయ స్థలాలు..

శ్వేతగిరి కొండ మధ్యలో వీరవసంతేశ్వర స్వామి ఆలయం ఉంది. ఇటీవలే ఇక్కడ అయ్యప్ప, నవగ్రహ, ఆంజనేయస్వామి దేవాలయాలు నిర్మించారు. భక్తులు కొండపైన వేణుగోపాలుడిని దర్శించుకొని తిరుగు ప్రయాణంలో వీరవసంతేశ్వరుని దర్శిస్తారు. కొండ దిగువన వెంకటేశ్వర స్వామి, గోవిందరాజస్వామి, నరసింహస్వామి ఆలయాలు ఉన్నాయి.

ప్రత్యేక ఏర్పాట్లు

స్వామిని భక్తులు సులువుగా దర్శించుకునేందుకు వీలుగా బ్యారికేడ్లు, క్యూలు ఏర్పాటు చేశారు. వీఐపీల కోసం ప్రత్యేక లైన్లు ఏర్పాటు చేశారు. 80వేల లడ్డూలను తయారు చేశారు. లక్ష మంది భక్తులు స్వామిని దర్శించుకునే అవకాశం ఉందని, అందుకు తగ్గట్టుగా ఏర్పాట్లు చేశామని వంశ పారంపర్య ధర్మకర్త సుగ్గు మధురెడ్డి తెలిపారు. ఆర్టీసీ సంస్థ ద్వారా ప్రత్యేక బస్సులు నడుపుతామని అధికారులు తెలిపారు.

కొండపైకి వాహనాలకు అనుమతి లేదు

యాత్ర సందర్భంగా శాలిహుండం కొండపైకి వాహనాలను అనుమతించడం లేదని సీఐ ఎల్. సన్యాసినాయుడు తెలిపారు. శ్రీకాకుళం నుంచి వచ్చే బస్సులు, వాహనాలను పూసర్లపాడు వద్ద, గార మీదుగా వాహనాలు బోరవానిపేట వరకూ అనుమతిస్తామన్నారు.

ఉత్సాహంగా జిల్లా సెపక్‌తక్ర జట్ల ఎంపికలు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా అండర్-14 బాలబాలికల సెపక్‌తక్ర జట్ల ఎంపికలు ఉత్సాహంగా సాగాయి. జిల్లా సెపక్‌తక్ర అసోసియేషన్ చైర్మన్ ఎమ్మెస్సార్ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో శ్రీకాకుళంలోని ఎన్టీఆర్ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ మైదానం వేదికగా శనివారం జరిగిన ఈ ఎంపికల్లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను జిల్లా ప్రాబబుల్స్ జట్లకు ఎంపికచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెస్సార్ మాట్లాడుతూ జిల్లాలో సెపక్‌తక్ర క్రీడాభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. క్రీడాకారులకు క్రమం తప్పకుండా బాస్కెట్‌బాల్, సెపక్‌తక్ర క్రీడాంశాల్లో శిక్షణ అందిస్తున్నామని వివరించారు. క్రీడాకారులంతా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇక్కడ ఎంపిక చేసిన జిల్లా తుది జట్లను ఈనెల 24, 25 తేదీల్లో నెల్లూరు వేదికగా జరగనున్న ఏపీ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్స్ బాలబాలికల సెపక్‌తక్ర చాంపియన్‌షిప్ పోటీలకు పంపిస్తామని సెపక్‌తక్ర అసోసియేషన్ కార్యదర్శి, డీఎస్‌ఏ కోచ్ జి.అర్జున్‌రావురెడ్డి చెప్పారు. బి. సోములు, పి.కొర్లయ్య, పి.లవకుమార్, బి.ప్రవీణ్, సీహెచ్ గణేష్, అరుణ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడు నిత్య విద్యార్థి

- విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్
- ఇచ్ఛాపురంలో సుడిగాలి పర్యటన



ఇచ్ఛాపురం రూరల్: విద్యార్థుల వర్క్ బుక్స్‌ను తనిఖీ చేస్తున్న ప్రవీణ్ ప్రకాష్

ఇచ్ఛాపురం రూరల్: తరగతి గదిలో ఉపాధ్యాయుడు నిత్య విద్యార్థిగానే ఉండాలని ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ అన్నారు. ఆయన శనివారం మండలంలోని భవానీపురం ప్రాథమిక పాఠశాల, మున్సిపాలిటీలోని గవర్నమెంట్ హైస్కూల్, లాలాపేట ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. బడిలో విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విలువలు నేర్పించాలని, మరికొద్ది రోజుల్లో ఫార్మేట్-4 పరీక్షలు ఉన్నప్పటికీ సంబంధిత సబ్జెక్ట్ ఉపాధ్యాయులు సిలబస్ పూర్తి చేయకపోవడంపై ఆయన భవానీపురం ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రాథమిక స్థాయి నుంచి విద్యార్థికి ఇంగ్లిష్ మాధ్యమంలో బోధించేందుకు ఇప్పటికే ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చినప్పటికీ ప్రయోజనం లేకుండా పోతుందన్నారు. పిల్లలకు నాణ్యమైన విద్యను అందించేందుకు పక్క రాష్ట్రాలతో పోల్చితే ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వం ఎక్కువే ఖర్చు చేస్తోందని, సుమారు మూడు వందల కోట్ల రూపాయలు ఖర్చుతో ఉపాధ్యాయులకు బైజూస్ ట్యాబ్‌లు అందిస్తే వాటిపై సరైన అవగాహన లేకపోవడం విచారకరమని అన్నారు. రూ.లక్షల విలువైన ఐఎఫ్ పీ బోర్డులను కాదని ఇప్పటికీ బ్లాక్ బోర్డులపై విద్యార్థులకు పాఠశాలు చెప్పడం సరి కాదని అన్నారు. ఒడియా మాధ్యమంలో చదువుతున్న విద్యార్థులు చివరి వరకు ఒడియా మాధ్యమంలోనే చదవడం భావ్యం కాదని, వారిని ఇంగ్లిష్ మీడియంలో చదివించాలని చెప్పారు. మరోమారు తన టీమ్‌ను ఈ ప్రాంతానికి పంపిస్తానని, అప్పటికీ అటు జిల్లా అధికారుల్లోను, ఉపాధ్యాయుల్లోనూ మార్పు రాకపోతే వారిపై చర్యలు తీసుకునేందుకు వెనుకాడనంటూ హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థుల నోట్ పుస్తకాలు, వర్క్ పుస్తకాలను పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట విశాఖపట్నం జోనల్ ఆర్‌జేడీ మణిపాత్రుని జ్యోతి కుమారి, జిల్లా విద్యాశాఖాధికారి కె.వెంకటేశ్వరరావు, డీసీఈబీ సెక్రటరీ జి.రాజేంద్రప్రసాద్, ఉప విద్యాశాఖాధికారి ఆర్.విజయకుమారీ, ఏపీసీ రోణంకి జయప్రకాష్, బైజూస్ జిల్లా నోడల్ అధికారులు ఎస్.జగదీష్, జి.భాస్కరరావు, ఇచ్ఛాపురం, కంచిలి, కవిటి, సోంపేట ఎంఈఓలు కురమాన అప్పారావు, మజ్జి ధనుంజయ, సప్పటి శివరాం ప్రసాద్, కుంబి చిట్టిబాబు, జోరాడులు ఉన్నారు.



కవిటి: ఇంటర్ తరగతుల్ని పరిశీలిస్తున్న ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాష్

కవిటి జీజే కాలేజీ పరిశీలన

కవిటి : స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ప్రవేశాలు పెంచకపోవడంపై విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు వందల మంది విద్యార్థులకు 11 మంది జూనియర్ లెక్చరర్లు ఉన్నారని, వచ్చే ఏడాది విద్యార్థుల సంఖ్య 400 దాటకుంటే సహించేది లేదని అన్నారు. ఆయన శనివారం కాలేజీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. నాడు-నేడు పనులు, మరుగుదొడ్ల పరిస్థితిపై అసంతృప్తి వ్యక్తం చేశారు. మళ్లీ కాలేజీకి వచ్చి పరిశీలిస్తానని, అప్పటికీ లోపాలు కనిపిస్తే తీవ్ర చర్యలు తప్పవని అన్నారు. ఆర్.బెలగాం ఉన్నత పాఠశాలలో సైతం ఐఎఫ్‌ఎల్ ప్యానెళ్ల నిర్వహణ, ట్యాబ్‌ల వినియోగంపైనా ఆగ్రహం వ్యక్తం చేశారు.

మూలపేట పోర్టు రైల్వే ట్రాక్‌కు భూ సేకరణ



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: మూలపేట పోర్టుకు సంబంధించి రైల్వే ట్రాక్ కోసం సేకరించిన భూములకు రైతులకు నష్ట పరిహారం అందజేస్తామని కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలాని సమూన్ స్పష్టం చేశారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్‌తో కలిసి మూలపేట పోర్టు రైల్వే ట్రాక్‌కు అవసరమైన భూ సేకరణకు సంబంధించి కూర్మనాథపురం, యామలపేట, పోతునాయుడుపేట, కోటపాడు, కాశీపురం, రాజపురం గ్రామాల ప్రజలతో సమావేశం నిర్వహించారు. భూ సేకరణ చట్టం ప్రకారం ఎంత ఉంటుందో అంతకుమించి ఇస్తున్నట్లు తెలిపారు. రైతులకు నష్టం లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ మాట్లాడుతూ ఆయా గ్రామాల నుంచి ఎవరు వచ్చిందీ తెలుసుకొని ఆరు గ్రామాల నుంచి 72 ఎకరాలు కావాల్సి ఉందని చెప్పారు. పంటల సమయంలో వ్యక్తిగతంగా వచ్చి పరిశీలించినట్లు వివరించారు. రైతులు నష్టపోకుండా న్యాయం చేస్తామని చెప్పారు. పొలాలకు వెళ్లేందుకు దారి ఏర్పాటు చేస్తామన్నారు. రోడ్డు రైలు ట్రాక్ అనుసంధానంగా ఉండే విధంగా భూసేకరణ చేస్తున్నట్లు చెప్పారు. ముంపు లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తామన్నారు. టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ మాట్లాడుతూ అవసరమైన భూమి సేకరించి మారిటైమ్ బోర్డుకు అప్పగించాల్సి ఉంటుందన్నారు. భూముల ధరలపై ఇప్పటికే మూడు సార్లు చర్చించినట్లు వివరించారు.

పోతునాయుడుపేట సర్పంచ్ మాట్లాడుతూ రైతులకు ఇబ్బందులు లేకుండా చేయాలని కోరారు. కొంచెం కొంచెం మిగిలిన భూములను తీసుకోవాలని కోరారు. కోటపాడు, యామలపేట, పోతునాయుడుపేట, తదితర గ్రామాల నుంచి మాట్లాడుతూ రైతులు నష్టపోకుండా చూడాలని కోరారు. పొలాలు ముంపునకు గురి కాకుండా చూడాలని చెప్పగా యామలపేట సర్పంచ్ రవికుమార్ మాట్లాడుతూ గ్రామాల్లోకి నీరుపోకుండా ప్రొటెక్షన్ ఏర్పాటు చేయాలని కోరగా.. రైతులకు ఏ విధమైన నష్టం లేకుండా చేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, జి.సెక్షన్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, సంతబొమ్మాళి తహసీల్దార్ జి.సత్యనారాయణ పాల్గొన్నారు.

క్లుప్తంగా

శ్రీకూర్మనాథుని సన్నిధిలో వెంకయ్యనాయుడు సతీమణి



శ్రీకూర్మనాథాలయంలో వెంకయ్యనాయుడు సతీమణి ఉషానాయుడు

గార: శ్రీకూర్మం కూర్మనాథుడిని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు సతీమణి ఉషానాయుడు శనివారం దర్శించుకున్నారు. ముందుగా మూలవిరాట్ వద్ద ప్రత్యేక పూజలు చేశారు. దేవస్థానం నుంచి ఆమెకు కూర్మనాథుని ప్రతిమను అందజేశారు. బీఎస్ఎన్ఎల్ రాష్ట్ర చీఫ్ జనరల్ మేనేజర్ ఎం.శేషాచలంశర్మ సోమవారం ఉదయం స్వామిని దర్శించుకున్నారు. ఆలయ ప్రధానార్చకులు చామర్తి సీతారామనృసింహాచార్యులు తెలియజేశారు.

'ప్రతి కుటుంబానికి పని కల్పించండి'



నందిగాంలో నిర్వహించిన సామాజిక తనిఖీ ప్రజావేదికలో మాట్లాడుతున్న డ్వామా పీడీ చిట్టిరాజు

నందిగాం: మండలంలోని ప్రతి కుటుంబానికి వందరోజుల పని కల్పించాలనే లక్ష్యంతో ప్రతి క్షేత్రసహాయకుడు పని చేయాలని డ్వామా పీడీ జి.చిట్టిరాజు అన్నారు. నందిగాంలో ఉపాధి హామీ పథకం 16 వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక శనివారం స్థానిక మండలపరిషత్ కార్యాలయ ఆవరణలో నిర్వహించారు. ఏప్రిల్ 2022 నుంచి మార్చి 2023 వరకు చేపట్టిన 1541 పనులకు సంబంధించిన రూ.16,10,91,215కు సంబంధించి గత పది రోజులుగా మండలంలో నిర్వహించిన సామాజిక తనిఖీ వివరాలను చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్, ఎస్ఎస్ఏ ఇరిగేషన్ పనులకు సంబంధించిన మెటీరియల్ పనులను 9 మంది డీఆర్‌పీలు పరిశీలించి నివేదికలను సభ దృష్టికి తీసుకువచ్చారు. పీడీ మాట్లాడుతూ నందిగాం మండలంలో 3500 కుటుంబాలకు వంద రోజుల పని తప్పనిసరిగా కల్పించాలని, 75–80 శాతం సగటు పనిదినాలు ఉండేలా అధికారులు చూడాలని సూచించారు. సమావేశంలో ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి, ఏపీడీలు మురళీకృష్ణ, లోకేష్, శైలజ, క్వాలిటీ కంట్రోల్ అధికారి గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

అందరికీ రక్త పరీక్షలు




మాట్లాడుతున్న ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి

సీతంపేట: సికిల్‌సెల్ ఎనీమియాను గుర్తించేందుకు 40 ఏళ్ల లోపు వయస్సువారందరికీ గ్రామాల్లో రక్తపరీక్షలు చేయాలని ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి వైద్య సిబ్బందిని ఆదేశించారు. ఐటీడీఏ పరిధిలోని వైద్య సిబ్బంది, ఎంపీడీఓలతో శనివారం సమీక్షించారు. వైద్యపరీక్షల నివేదికలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేయాలని, ఐటీడీఏకు అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో శ్రీకాకుళం డీఎంహెచ్ఓ బొడ్డేపల్లి మీనాక్షి, పార్వతీపురం మన్యం డీఎంహెచ్ఓ బి.జగన్నాథరావు పాల్గొన్నారు.

కిల్కారీ యాప్‌పై శిక్షణ

ఎస్ఆర్ శంకరణ్ సమావేశ మందిరంలో కిల్కారీ యాప్‌పై శిక్షణ ఇచ్చారు. డీఎంహెచ్ఓ జగన్నాథరావు మాట్లాడుతూ ఈ యాప్‌లో రూపొందించిన కోర్సును ప్రతి ఆశ కార్యకర్త పూర్తి చేయాలన్నారు. గర్భిణులకు అవగాహన కల్పించాలన్నారు. ఆర్‌సీహెచ్ పోర్టల్‌లో గర్భిణుల ఫోన్‌నంబర్లు పొందుపర్చాలని సూచించారు. ప్రతివారం గర్భిణుల వాయిస్ రికార్డుతో ఫోన్ కాల్ వస్తుందని, అవసరమయ్యే సూచనలు, సలహాలు ఇస్తారన్నారు. కార్యక్రమంలో స్టేట్ ప్రోగ్రాం మేనేజర్ రాజు, డిప్యూటీ డీఎంహెచ్ఓ విజయపార్వతి, మోహనరావు, ఉషారాణి, తదితరులు పాల్గొన్నారు.

ఎచ్చెర్ల ఎంపీపీ అరెస్టు



ఎంపీపీ చిరంజీవిని అరెస్టు చేస్తున్న పోలీసులు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మాజీ సర్పంచ్ జరుగుళ్ల శంకరరావు హత్యాయత్నం కేసులో ఎచ్చెర్ల ఎంపీపీ మొదలవలస చిరంజీవిని శనివారం సాయంత్రం పోలీసులు అరెస్టు చేశారు. ఫరీదుపేటలోని ఎంపీపీ ఇంటికి చేరుకున్న జేఆర్‌పురం సీఐ జి.రామచంద్రరావు, ఎస్ఐ చిరంజీవితో కూడిన బృందం ముందుగా అరెస్టు నోటీసు అందజేసింది. అనంతరం అరెస్టు చేశారు. ఈ నెల 9వ తేదీన శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం సమీపంలోని ఎస్ఎం పురం రోడ్డులో శంకరరావుపై గుర్తుతెలియని వ్యక్తులు దాడిచేశారు. ఆయన ప్రస్తుతం విశాఖపట్నంలోని పినాకిల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పలు కోణాల్లో కేసు దర్యాప్తు చేస్తున్న పోలీసులు ఇప్పటికే ఐదుగురిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. సేకరించిన ఆధారాలతో ఎంపీపీని అరెస్టు చేశారు. నేరంతో ప్రమేయం ఉన్న మరి కొందరిని అరెస్టు చేసేందుకు సిద్ధమవుతున్నారు.

పని నేర్పి.. కొలువు చూపి

- డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో ట్రేడ్‌తో పాటు కంప్యూటర్‌పై అవగాహన
- శిక్షణ అనంతరం మెరుగైన ఉపాధి



సూయింగ్ మిషన్ ఆపరేటర్ ట్రేడ్‌లో శిక్షణ ఇస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల: జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ) ఆధ్వర్యంలో జాబ్ పథకం ద్వారా నిరుద్యోగ యువతకు మెరుగైన పద్ధతుల్లో ఉపాధి శిక్షణ అందజేస్తున్నారు. ఇదివరకూ ఏ ట్రేడ్‌లో జాయిన్ అయితే ఆ ట్రేడ్‌కు సంబంధించిన శిక్షణ మాత్రమే అందించేవారు. ఇప్పుడు ట్రేడ్‌తో పాటు పలు నైపుణ్య శిక్షణలను కూడా అందిస్తున్నారు. ఎచ్చెర్ల సమీపంలోని సాంకేతిక శిక్షణాభివృద్ధి కేంద్రంలో స్కిల్ కళాశాలలో నిరుద్యోగ యువతకు రెండు రకాల ట్రేడ్‌లలో శిక్షణ ఇస్తున్నారు. సీడాప్ ఆధ్వర్యంలో సూయింగ్ మిషన్ ఆపరేటర్ (ఎంఎస్ఓ), పేషెంట్ రిలేషన్ అసోసియేట్ రంగాల్లో ఉపాధి శిక్షణలు అందిస్తున్నారు. సూయింగ్ మిషన్ ఆపరేటర్ రంగంలో మహిళలకు కుట్టుశిక్షణతో పాటు కంప్యూటర్‌పై అవగాహన, ఇంగ్లిష్ భాషపై పట్టు, కమ్యూనికేషన్ స్కిల్స్‌పై శిక్షణ ఇస్తున్నారు. శిక్షణ అనంతరం టెక్స్‌టైల్స్ కంపెనీల్లో ఉపాధి కల్పిస్తున్నారు. అలాగే పేషెంట్ రిలేషన్ అసోసియేట్ శిక్షణలో కమ్యూనికేషన్ స్కిల్స్, కంప్యూటర్‌పై అవగాహన, ఇంగ్లిష్‌లో ప్రావీణ్యత, వైద్యరంగంలో నైపుణ్యాలను నేర్పిస్తున్నారు. ఈ రెండు రంగాలకు డిమాండ్ ఉండటంతో శిక్షణ పూర్తి చేసిన వెంటనే ఉపాధి లభిస్తుందని ఇక్కడ అధికారులు చెబుతున్నారు.

బ్యాచ్‌ల వారీగా శిక్షణ

ఇక్కడ ఒక్కో రంగానికి బ్యాచ్‌ల వారీగా శిక్షణ ఇస్తున్నారు. బ్యాచ్‌కు 35 మంది చొప్పున పేషెంట్ రిలేషన్ అసోసియేట్ శిక్షణలో ఇప్పటివరకూ నాలుగు బ్యాచ్‌లకు సంబంధించి 140 మందికి శిక్షణ ఇచ్చారు. వీరిలో 114 మందికి వివిధ ఆస్పత్రుల్లో ఉపాధి కల్పించారు. ప్రస్తుతం 5వ బ్యాచ్ వారు శిక్షణ పొందుతున్నారు. అలాగే సూయింగ్ మిషన్ ఆపరేటర్ శిక్షణ 90 రోజుల పాటు ఇస్తున్నారు. ఉచిత భోజన, వసతి సౌకర్యం కూడా ఉంది. శిక్షణ అనంతరం విజయవాడలోని మోహన స్కిల్స్ తిరుపతిలోని లోయల్‌స్కిల్స్ టెక్స్‌టైల్స్ కంపెనీల్లో ఉపాధి కల్పిస్తున్నారు.

చదువుకోలేని వారికి ఆసన్న హస్తం

పెద్దగా ఉన్నత చదువులు లేని వారికి ఈ శిక్షణ చాలా ఉపయోగపడుతున్నాయి. పదో తరగతి, ఇంటర్మీడియెట్, డిగ్రీ వరకూ చదువుకుని ఇంటి వద్ద పరిస్థితులు బాగా లేక ఉండిపోయిన వారికి ఇవి ఉపాధి మార్గం చూపిస్తున్నాయి. ఈ శిక్షణల్లో చేరడానికి 18 ఏళ్లు నిండి పదో తరగతి వరకూ చదువుకున్న మహిళలు అర్హులు కావటం వల్ల చదువు మధ్యలో ఆపేసిన వారు ఎక్కువగా ఈ శిక్షణలో చేరుతున్నారు.

ఉపాధి కోసం..



ఉద్యోగం సంపాదించి ఇంటికి చేదోడుగా ఉండటానికి ఈ శిక్షణలో చేరాను. సూయింగ్ మిషన్ ఆపరేటర్ శిక్షణ పొందుతున్నాను. ఇక్కడ కుట్టుతో పాటు ఇంగ్లిష్, కంప్యూటర్‌పై శిక్షణ ఇస్తున్నారు. ఇంటర్మీడియెట్ చదువుకున్నాను. పై చదువులు చదవలేక ఖాళీగా ఉన్న సమయంలో జేఆర్‌పీ ద్వారా ఇక్కడ శిక్షణ ఇస్తున్నారని తెలుసుకుని జాయిన్ అయ్యాను.

– శైలజ, సారవకోట మండలం, వెంకటాపురం

మెరుగైన శిక్షణ



ఇక్కడ యువతకు మెరుగైన శిక్షణ అందిస్తున్నాం. కుట్టడం, కత్తిరించడం, ప్రాక్టికల్స్ ఇలా అన్ని విధాలా మూడు నెలల పాటు శిక్షణ ఇచ్చి ఉపాధి కూడా చూపిస్తున్నాం. విద్యార్థులు కూడా శిక్షణలో మంచి నైపుణ్యతను సాధిస్తున్నారు.

– వై.నాగమణి, సోయింగ్ మిషన్ ఆపరేటర్, ఇన్‌స్ట్రక్టర్

ప్రభుత్వ వైద్యానికి పెద్ద పీట

- నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్
- వంద పడకల ఆస్పత్రి భవనాలు ప్రారంభం



ఆస్పత్రి శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

నరసన్నపేట: ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యానికి ప్రస్తుత ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. అలాగే జిల్లాలో నరసన్నపేట నియోజకవర్గంలో ఆస్పత్రులు, పీహెచ్‌సీలు, సబ్‌సెంటర్లు అన్నింటినీ అభివృద్ధి చేశామని తెలిపారు. స్థానిక వంద పడకల ప్రభుత్వ ఆస్పత్రిలో నాబార్డు నిధులు రూ.12.60 కోట్లతో నిర్మించిన నూతన భవనాలను ఆయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో కిడ్నీ రోగుల కోసం రీసెర్చ్ సెంటర్‌తోపాటు డయాలసిస్ యూనిట్లు అందుబాటులోకి తీసుకువచ్చామని తెలిపారు. పీహెచ్‌సీల్లో ఇద్దరు చొప్పున వైద్యులను నియమించామని, కమ్యూనిటీ ఆస్పత్రులు, ఏరియా, జిల్లా ఆస్పత్రుల్లో వైద్యులను, సిబ్బందిని పూర్తి స్థాయిలో నియమించామని, నిపుణులైన వైద్యులను నియమించామని అన్నారు. మందుల బడ్జెట్ పెంచామని, అధునాతన పరికరాలు అందుబాటులోకి తీసుకువచ్చామని తెలిపారు. రక్త పరీక్షలకు ఇతర చోట్లకు వెళ్లనవసరం లేకుండా ఆస్పత్రుల్లోనే తగిన పరికరాలు ఏర్పాటు చేశామన్నారు. ఫ్యామిలీ డాక్టర్ పథకంతో గ్రామాల్లో ప్రజల చెంతకు వైద్యం తీసుకువచ్చామన్నారు. టీడీపీ హయాంలో పీహెచ్‌సీలు, ఇప్పుడు పీహెచ్‌సీలు చూస్తే మార్పు కనిపిస్తుందన్నారు. నరసన్నపేట ఆస్పత్రిలో పూర్తి స్థాయిలో వైద్యులను నియమించామని అన్నారు. అందరూ బాధ్యతగా పనిచేసి ప్రజలకు సేవ చేయాలని కోరారు.

కార్యక్రమంలో ఏపీఎంఎస్ఐడీసీ ఈఈ సత్య ప్రభాకర్, డీఈ శిమ్మన్న, డీసీహెచ్ రాజ్యలక్ష్మి, నరసన్నపేట ఆస్పత్రి సూపరింటెండెంట్ జయశ్రీ, పోలాకి జెడ్పీటీసీ ధర్మాన కృష్ణచైతన్య, ఎంపీపీ ఆరంగి మురళి, జెడ్పీటీసీ మాజీ సభ్యులు చింతు రామారావు, నరసన్నపేట సర్పంచ్ బూరల్లి శంకర్, ఆసుపత్రి ఏఓ ఏపీవీ రమణమూర్తి,ఉప సర్పంచ్ ఎస్.కృష్ణబాబు, వార్డు సభ్యులు బీఎల్ శర్మ, ఎంపీటీసీ నేతింటి రాజేశ్వరరావు, పార్టీ నాయకులు గుప్త, సదాశివుని కృష్ణ, సాయి ప్రసాద్, బొబ్బాది ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

'మాదక ద్రవ్యాల వాడకం అరికడదాం'

శ్రీకాకుళం పాతబస్టాండ్:



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలాని సమూన్

జిల్లాను మాదక ద్రవ్య రహిత జిల్లాగా మార్చాలని కలెక్టర్ మనజీర్ జిలాని సమూన్ జిల్లా స్థాయి మాదక ద్రవ్యాల నివారణ కమిటీ సభ్యులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఎస్పీ జీఆర్ రాధికతో కలిసి మత్తు పదార్థాల నివారణ, మాదక ద్రవ్యాల అక్రమ రవాణా నిరోధంపై (నార్కోటిక్ డ్రగ్స్, సైకోట్రోపిక్ పదార్థాలు) జిల్లా స్థాయి కమిటీ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మాదక ద్రవ్యాల వాడకం, రవాణాను అరికట్టడానికి పకడ్బందీ ప్రణాళిక రూపొందించాలని సూచించారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వాస్పత్రుల పరిధిలో డి అడిక్షన్ సెంటర్ ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యా శాఖ కీలక పాత్ర పోషించి యువత చెడు మార్గాలు పట్టకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. ముఖ్యంగా ఎక్కువ మంది కార్మికులు పనిచేసే ప్రదేశాల్లో, గుర్తించిన హాట్ స్పాట్ ప్రదేశాల్లో గంజాయి వంటి మాదక ద్రవ్యాల రవాణాపై నిఘా ఉండాలని, మాదక ద్రవ్యాల వినియోగం, విక్రయం, రవాణా తదితర ఏ రూపంలో ఉన్న తీవ్రమైన నేరంగా పరిగణిస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు. పటిష్ట నిఘా ఏర్పాటు చేయడం, నిఘా ఉందనే విషయం ప్రతి ఒక్కరికీ తెలియాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. చెక్ పోస్టుల వద్ద పటిష్టమైన నిఘా ఉండాలని అధికారులను ఆదేశించారు. ఎస్పీ రాధిక మాట్లాడుతూ జిల్లాలో ఒడిశా సరిహద్దుగా 112 కిలోమీటర్లు ఉందని 52 రహదారుల ద్వారా రాకపోకలు జరుగుతున్నాయని ఆరు చెక్ పోస్టులు ఏర్పాటు చేశామని, ఇవి కాకుండా నిరంతరం పెట్రోలింగ్ టీమ్‌లు తిరుగుతాయని చెప్పారు. గడిచిన ఆరు నెలల్లో 110 కిలోల గంజాయి అక్రమ రవాణా అడ్డుకుని 14 మందిని వేర్వేరు కేసుల్లో పట్టుకున్నామని చెప్పారు. ప్రతి కళాశాలలో మాదక ద్రవ్యాల నియంత్రణ కమిటీలు పటిష్టంగా పనిచేసేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జిల్లాలోని ఫ్యాక్టరీల్లో పనిచేయడానికి వచ్చే వలస కార్మికులు గంజాయి లేదా ఇతర మాదకద్రవ్యాలను ఫ్యాక్టరీల్లోకి అక్రమంగా తరలించడం, సేవించడం వంటివి జరగకుండా యజమానులు తప్పకుండా తనిఖీ చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో ట్రమాడాల్ టాబ్లెట్స్ లేదా ఇంజెక్షన్ల వాడకాన్ని డ్రగ్ కంట్రోల్ అధికారులు తరచూ పర్యవేక్షించాలని, వాటి వినియోగంలో వైద్యుల ప్రిస్క్రిప్షన్ తప్పనిసరిగా ఉండేలా చూడాలని అన్నారు. రవాణా వ్యవస్థ పై నిఘా ఉందని, జిల్లాలో మాదక ద్రవ్యాల నియంత్రణకు అన్నీ శాఖల సహకారంతో అన్నీ చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. జిల్లాలో ఎవరైనా మాదకద్రవ్యాలను రవాణా చేసినా, కలిగి ఉన్నా, సేవించినా చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు.

సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, అడిషనల్ ఎస్పీ ప్రేమ్ కాజల్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, డిఎంహెచ్ఓ బి.మీనాక్షి, జెడ్పీ సీఈఓ వెంకటేశ్వరరావు, గారు ఆర్.డి.ఓ. సిహెచ్.రంగయ్య, అటవీ శాఖ, డ్రగ్ కంట్రోల్, విద్యాశాఖ, పోలీస్ ఇన్‌స్పెక్టర్లు, రవాణా తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

'సోంపేట ఉద్యమం భావి తరాలకు స్ఫూర్తి'



పుస్తకావిష్కరణ కార్యక్రమంలో మాట్లాడుతున్న పుస్తక రచయిత అజశర్మ

సోంపేట: సోంపేట థర్మల్ ఉద్యమం భావి తరాలకు స్ఫూర్తినిస్తుందని, అందుకే పర్యావరణ పరిరక్షణ ఉద్యమంపై పుస్తకం రాశానని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ అన్నారు. సోంపేట పర్యావరణ పరిరక్షణ ఉద్యమంపై ఎ.అజశర్మ రాసిన 'మా బీల .. మా నేల.. మా బతుకు' పుస్తకాన్ని డాక్టర్ ఖగేశ్వరరావు అధ్యక్షతన పర్యావరణ పరిరక్షణ సంఘ అధ్యక్షుడు డాక్టర్ యారడి కృష్ణమూర్తి శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పట్టణంలోని కలాసీ సంఘ భవనంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అజశర్మ మాట్లాడుతూ భావి తరాలకు ఉపయోగపడాలనే ఈ పుస్తకాన్ని రచించినట్లు తెలిపారు. పర్యావరణ పరిరక్షణ సంఘ అధ్యక్షుడు డాక్టర్ కృష్ణమూర్తి మాట్లాడుతూ సోంపేట పర్యావరణ పరిరక్షణం కోసం జరిగిన ఉద్యమం పుస్తక రూపంలో రావడం అభినందిచదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో పర్యావరణ పరిరక్షణ, మత్స్యకార ఐక్యవేదిక, వివిధ సంఘాల ప్రతినిధులు మోహనరావు, గోపాలరావు, బార్ల సుందరరావు, నాగు, వెంకన్న, టి.కోదండరావు, ఎం.ధనం,బి.శంకరరావు పాల్గొన్నారు.

ఘనంగా త్యాగరాజ ధ్యాన ఆరాధనోత్సవాలు



పంచరత్న కీర్తనలు ఆలపిస్తున్న కళాకారులు



సంప్రదాయం చిన్నారుల నృత్య ప్రదర్శన

శ్రీకాకుళం కల్చరల్ : క్లోపల్లిలోని సంప్రదాయం కూచిపూడి గురుకులంలో ఆనందో బ్రహ్మ స్పిరిట్యువల్ టాబ్లెట్స్, శ్రీకాకుళం పీఎస్ఎస్ఎం మాస్టర్ల సంయుక్త నిర్వహణలో త్యాగరాజ స్వామి ధ్యాన ఆరాధనోత్సవాలు శనివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా సంప్రదాయం డైరెక్టర్ స్వాతి సోమనాథ్ మాట్లాడుతూ త్యాగరాజు పంచరత్న కీర్తనలు ఇప్పటికీ ప్రాచుర్యంలో ఉన్నాయని తెలిపారు. సురంపల్లి శ్రీనివాస్ శాక్సాఫోన్ వాయిద్య సంగీత ధ్యానం, ఆనందో బ్రహ్మ గ్రూపు త్యాగరాజ కృతులు, రెల్లబాబూరావు త్యాగరాజ కృతులు, శ్రీవాణి సంగీత కళాక్షేత్రం శిష్యబృందం త్యాగరాజ కీర్తనలు, రాజరాజేశ్వరీ సంగీత విద్యాపీఠం శిష్యుల కీర్తనల ఆలాపన ఆకట్టుకున్నాయి. సంప్రదాయం విద్యార్థుల కూచిపూడి నృత్య ప్రదర్శన కూడా జరిగింది. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ నూకల తాతబాబు, ఈవెంట్ మేనేజర్ సాయిరాం శ్రీనివాసరావు, ఎస్.జోగినాయుడు, గంగుల నరేంద్ర, ఆనందో బ్రహ్మ ప్రతినిధులు, మావుడూరు సత్యనారాయణశర్మ, దుంపల ఈశ్వరరావు, సుసరాపు లక్ష్మీగణపతి శర్మ, వాయునందన శర్మ, మావుడూరు సూర్యప్రసాద్, మండ శ్రీనివాస్, బంకుపల్లి దుర్గా శ్రీనివాస్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ పంటకు భారీ రాయితీలు

కోటబొమ్మాళి: ఆయిల్‌పామ్ పంటలు సాగు చేసే రైతులు ప్రభుత్వం నుంచి భారీ రాయితీలు పొందవచ్చునని కోటబొమ్మాళి ఉద్యానవన శాఖాధికారి సునీత శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పంట వేసే చిన్న, సన్నకారు రైతులకు ఒక ఎకరాకు ఏడాదికి రూ.8,400 చొప్పున నాలుగేళ్లలో మొత్తం రూ.27,801 పొందవచ్చని చెప్పారు. అలాగే ఉపాధి హామీ ద్వారా మూడేళ్లలో రూ.47,648, బిందు సేద్యం ద్వారా రూ.93.449 రాయితీ పొందవచ్చునని పేర్కొన్నారు. పంట వేయడానికి ఆసక్తిగల రైతులు తన మొబైల్ నంబర్ 7207330670కు సంప్రదించాలని కోరారు.

ఉద్యోగుల సమస్యలపై ఆందోళన

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం చొరవ చూపాలని ఎన్‌జీఓ అసోసియేషన్ అధ్యక్షుడు హనుమంతు సాయిరాం అన్నారు. కలెక్టరేట్ వద్ద ఉద్యోగులు నిర్వహించిన ధర్నా శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న ప్రతి ఉద్యోగి ప్రభుత్వానికి పాలన, పాలనేతర అంశాలలో సంపూర్ణంగా సహకరించామన్నారు. ఉద్యోగులకు రావాల్సిన డీఏ బకాయిలను జమ చేయాలని కోరారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి డిమాండ్లను పరిష్కరించాలని, లేకుంటే ఆందోళన బాట పట్టేందుకు నిర్ణయం తీసుకుంటామన్నారు.

వైవీ సుబ్బారెడ్డికి అభినందనలు



వైవీ సుబ్బారెడ్డిని కలుసుకుని శుభాకాంక్షలు తెలిపిన కరిమి రాజేశ్వరరావు

శ్రీకాకుళం అర్బన్: టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి రాజ్యసభ సభ్యునిగా ఎంపిక కావడంపై శ్రీకాకుళం డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు అభినందనలు తెలిపారు. వైవీ సుబ్బారెడ్డిని శనివారం విజయవాడలో కరిమి రాజేశ్వరరావు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

జెమ్స్‌కు ఎక్స్‌లెన్స్ ఇన్ హెల్త్‌కేర్ సర్వీసెస్ అవార్డు



ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ చేతులమీదుగా అవార్డు అందుకుంటున్న దృశ్యం

శ్రీకాకుళం రూరల్: జిల్లాలోని రాగోలు జెమ్స్ ఆస్పత్రికి చీఫ్ మినిస్టర్ ఫర్ ఎక్స్‌లెన్స్ ఇన్ హెల్త్‌కేర్ సర్వీస్ అవార్డు ఈ నెల 13న ఒడిశా ప్రభుత్వం అందజేసిందని ఆస్పత్రి నిర్వాహకులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. దేశంలోని 22 ఆస్పత్రులు ఈ అవార్డు గెలుచుకోగా, మన రాష్ట్రం నుంచి జెమ్స్ మాత్రమే చోటు సాధించిందని పేర్కొన్నారు. రోగులకు భద్రత, వారికి అందిస్తున్న సౌకర్యాల కల్పనతో పాటు ఒడిశా ప్రభుత్వం అందిస్తున్న బీఎస్‌కేవై పథకం ద్వారా రోగులకు మెరుగైన ఉచిత సేవలు అందించినందుకు గాను ఈ అవార్డును ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ చేతులమీదుగా తీసుకున్నట్లు జెమ్స్ సీఈఓ బొల్లినేని ఆద్విక్ తెలిపారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ అవార్డుతో జెమ్స్‌పై బాధ్యత మరింత పెరిగిందన్నారు. రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. శిబిరాలకు వచ్చిన రోగులకు వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసి వారికి ఆరోగ్యశ్రీ, బీఎస్‌కేవై తదితర పథకాల ద్వారా వ్యాధి నయం చేసేందుకు ఆస్పత్రి సిబ్బంది చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. అవార్డును అందుకున్న వారిలో సీఏఓ ఎస్.రామ్మోహన్, డైరెక్టర్లు డాక్టర్ సుధీర్, ఆర్‌ఎంఓలు డాక్టర్ బాలమురళీ, ప్రవీణ్, ఆపరేషన్ మేనేజర్ జ్యోత్స్న, పాల్గొన్నారు.

నిఘా బృందాలకు దిశానిర్దేశం

శ్రీకాకుళం పాతబస్టాండ్:



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

ఎన్నికల విధుల్లో నిఘా బృందాలు పూర్తి పారదర్శకంగా పని చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మనజీర్ జిలాని సమూన్ అన్నారు. వివిధ నిఘా బృందాలు, పలు శాఖల ఉన్నతాధికారులతో కలెక్టర్ సమావేశ మందిరంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఎస్పీ జీఆర్ రాధికతో కలిసి ఆయన మాట్లాడారు. ఓటర్లను ప్రలోభాలకు గురి చేసే చర్యలను నిరోధించడం, ఫిర్యాదులపై తక్షణమే స్పందించడం, నిరంతర తనిఖీల నిర్వహణ తదితర అంశాలపై దిశానిర్దేశం చేశారు. ఈసీఐ నూతన మార్గదర్శకాల ప్రకారం ఎన్నికల వ్యయం విషయంలో ఎలక్షన్ కమిషన్ ప్రత్యేక దృష్టిని కేంద్రీకరిస్తోందని చెప్పారు. తప్పుడు ఫిర్యాదుల విషయంలో జాగ్రత్తగా ఉండాలని, అలాంటి వాటిపై తగిన చర్యలు చేపట్టాలన్నారు. ఎన్నికల వ్యయం, ప్రచార సరళిపై నిఘా బృందాలు అనునిత్యం నిఘా ఉంచాలని, ఈ మేరకు పూర్తి స్థాయిలో బృందాలను ఏర్పాటు చేస్తామని చెప్పారు. నగదు జప్తు చేసే సందర్భాల్లో తగు రీతిలో పంచనామా నిర్వహించి తప్పనిసరిగా రశీదులు అందించాలని ఆదేశించారు. అంతేకాకుండా తగిన ఆధారాలను చూపించి నగదును విడిపించుకునే వెసులుబాటు ఉందనే విషయాన్ని వివరించాలని అన్నారు. త్వరలోనే జిల్లా స్థాయి కమిటీని నియమిస్తామని అన్నారు. జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ మాట్లాడుతూ ఎలక్షన్ సీజర్ మేనేజ్మెంట్ సిస్టమ్ అప్లికేషన్ గురించి వివరించారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ ప్రేమ్ కాజల్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, అటవీ శాఖ, డ్రగ్ కంట్రోల్, విద్యాశాఖ, రవాణా తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.